క్లుప్తంగా

క్రీడలు స్నేహభావం పెంపొందిస్తాయి



అమరచింత: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడా పోటీలు క్రీడాకారుల్లో స్నేహభావం పెంపొందిస్తాయని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో శనివారం నిర్వహిస్తున్న ఓపెన్‌టూ ఆల్ కబడ్డీ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతిగా రూ.50,116 నగదును తాను అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, మహేందర్ రెడ్డి, అరుణ్‌కుమార్, ప్రకాశం, శ్యామ్ కుమార్, పోషిరిగారి విష్ణు, నాగునాయక్ తదితరులు పాల్గొన్నారు.

25న నిరుద్యోగ మార్చ్

పెబ్బేరు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 25న నిర్వహించనున్న నిరుద్యోగ మార్చ్ బీజేపీ పోరుబాటను విజయవంతం చేయాలని శనివారం మండల అధ్యక్షుడు భగవంతుయాదవ్ ఒక ప్రకటనలో కోరారు. 1,400 మంది యువత బలిదానం చేసిన తర్వాత వచ్చిన తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో పోరాటం చేసిన వారి లక్ష్యం నెరవేరలేదన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా.. భర్తీ చేయకుండా కాలక్షేపం చేస్తున్నారని, ప్రశ్న పత్రాల లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపి, కేటీఆర్‌ను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

చెరువు పనులు అడ్డుకున్న రైతులు



ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న గణపసముద్రం చెరువు పనులను శనివారం కొందరు రైతులు అడ్డుకున్నారు. ఈ చెరువును రిజర్వాయర్‌గా మార్చుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో పాటు టెండర్లు కూడా పూర్తి చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ హర్ష కన్‌స్ట్రక్షన్ వారు పనులు ప్రారంభించారు. ఇది తెలుసుకున్న చెరువులో భూములు కోల్పోతున్న రైతులు కొందరు శనివారం వచ్చి పనులను అడ్డుకున్నారు. భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు ఎంత నష్టపరిహారం ఇస్తారో చెప్పకుండా పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. దీనిపై స్పష్టమైన హామీ వస్తేనే పనులకు సహకరిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతులు రవీందర్‌రెడ్డి, మల్లేష్, మహేష్, కృష్ణయ్య, నవీన్, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



కొత్తకోట: పట్టణ కేంద్రంలో అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రంలో 5వ తరగతి గురుకుల పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి జేఎం మిషేక్ శనివారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఐదో తరగతి గురుకుల పాఠశాల ప్రవేశం కోసం నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులకు ప్యాడ్లు అందించామన్నారు. అనంతరం జేఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు టీచర్లు అనిల్, భార్గవి, రవిని అభినందించారు. కార్యక్రమంలో సతీష్, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పెంట్లవెల్లి: హైదరాబాద్ సిటీన్యూరో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండల పరిధిలోని గోపులాపూర్‌కి చెందిన నర్సింహను ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. కొద్ది రోజుల కిందట కాలుకు ఇన్‌ఫెక్షన్ అయి కాలు తీసేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శించి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. కృత్రిమ కాలును సీఎంఆర్ఎఫ్‌లో మంజూరు చేయిస్తానని, అన్ని విధాలుగా కుటుంబానికి అండగా ఉంటానన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని 11వ వార్డులో అనారోగ్యంతో మృతిచెందిన బొలమోని బిచ్చన్న కుటుంబాన్ని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ పగిడాల శ్రీనివాసరెడ్డి వేర్వేరుగా పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. వారి వెంట స్థానిక నాయకులు ఉన్నారు.



ఖిల్లాఘనపురంలో కాంగ్రెస్ నాయకులు



వనపర్తిలో..



పెబ్బేరులో ఈద్గా వద్ద..

అల్లా చింతనే అసలైన దైవమార్గం

అమరచింత: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని అమరచింత, ఆత్మకూర్ మండలాల్లో ఈదుల్ ఫితర్ ప్రార్థనలను ముస్లింలు ఈద్గాల వద్ద జరుపుకొన్నారు. నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలను చేపట్టిన ముస్లింలు చివరి రోజున రంజాన్ పండుగను జరుపుకొన్నారు. ఈమేరకు ఈద్గాల వద్ద ప్రత్యేక నమాజును మౌలాన అల్తాఫ్ బేగ్ నిర్వహించారు. ఖురాన్ లో మహ్మద్ ప్రవక్త బోధించిన సూక్తులను వినిపించారు. ఈద్గాల వద్ద ఆత్మకూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, అమరచింత మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అమరచింత, ఆత్మకూర్ మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు రవికుమార్ యాదవ్, రమేష్, మార్కెట్ చైర్మన్ ఎస్ఏ రాజు, ఆత్మకూర్ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, నరసింహులు గౌడ్, బాలరాజ్, మహేందర్‌రెడ్డి, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ రత్నం ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో రంజాన్ పండుగ పర్వదినాన్ని ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకొన్నారు. వీపనగండ్ల, కల్వరాల, తూంకుంట తదితర గ్రామాల్లోని ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేడుకల్లో సర్దార్, అమీర్, రజాక్, గఫార్, షమీ, అక్బర్, ఖాజా, రుక్మద్దిన్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో దైవ సందేశం వినిపిస్తున్న ఇమామ్

చిన్నంబావి: మండలంలోని కొప్పునూరు, పెద్దమారు, వెల్టూరు, బెక్కం గ్రామాల్లో ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని పాల్కి చెరువు సమీపంలోని ఈద్గా వద్ద ముస్లింలు శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ నాగన్న ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ముస్లింలు శనివారం రంజాన్ పండుగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు జామా మసీద్ నుంచి ర్యాలీగా వెళ్లి ఈద్గా దగ్గర ప్రార్థనలు చేశారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మండలంలోని దుప్పల్లి, రామన్‌పాడు, తిర్మలాయపల్లి, మదనాపురం, కొన్నూర్ తదితర గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాష, రహిం, షకీల్, గౌసొద్దీన్, హకీమ్, రఫీక్, అబ్దుల్, సుల్తాన్ పాల్గొన్నారు.

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. రేవల్లి మండలంలోని చెన్నారంలో ఈద్గా నిర్మాణానికి మంత్రి నిరంజన్‌రెడ్డి చొరవ తీసుకుని స్థలాన్ని కేటాయించడంపై ముస్లింలు ధన్యవాదాలు తెలిపారు.

ఖిల్లాఘనపురం: మండలంలో ముస్లింలు రంజాన్ పండును శనివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రమేష్, మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు జయకర్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తకోట: పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో రంజాన్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈద్గా వద్ద ప్రార్థనలు అనంతరం దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ముస్లింలకు రంజాన్ శుభకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్వరి భీంరెడ్డి, యుగేంధర్‌రెడ్డి, అన్వర్, వహిద్, హనీఫ్, తాహెర్, ముజీబ్ అఖిల్, షాషా, ఐబద్దీస్, సర్దార్, ఇబ్రహీం పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో..



గోపాల్‌పేటలో..



రేవల్లి మండలంలోని చెన్నారంలో..



కల్వరాలలో..



పాన్‌గల్‌లో..



ఆత్మకూర్‌లో..



వనపర్తిలో..

ప్రతి గింజను ప్రభుత్వమే కొంటుంది



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరచింత: రైతులు పండించిన ప్రతి వరి గింజను ప్రభుత్వపరంగా కొనుగోలు చేయడానికే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్, పాంరెడ్డిపల్లి గ్రామాల్లోని రైతువేదికల వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని, ప్రతి పంటకు పెట్టుబడి సాయంతో పాటు వరికి గిట్టుబాటు ధరను అందించి అన్నదాతకు అండగా ఉంటున్నామని తెలిపారు. రైతుబంధుతో పాటు రైతుబీమాను ప్రవేశపెట్టి దేశవ్యాప్తంగా రైతుల కోసం ఎక్కడ ఏ ప్రభుత్వం ప్రవేశపెట్టని సంక్షేమ పథకాలు అందించిన రాష్ట్రంగా తెలంగాణను ముందంజలో ఉంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. జిల్లాలో అత్యధికంగా జూరాల ఎడమ కాల్వ పరిధిలోని ఆయకట్టు రైతులు వరిని పండించారని, పూర్తి స్థాయిలో రైతుల నుంచి వరిని త్వరితంగా కొనుగోలు చేస్తూ సకాలంలో రైతులకు డబ్బులు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాజేశ్వరమ్మ, పావని, జెడ్పీటీసీ మార్క సరోజ, ఐకేపీ ఏపీఎం వెంకటేష్, ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

పాన్‌గల్: మండలంలోని దొండాయిపల్లిలో భారత రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ వార్షికోత్సవ సభ, జయంతి కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కేవీపీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎమ్మెస్పీ, బీఎస్పీ నాయకులు, స్థానిక నాయకులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. అయా వర్గాలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని వేడుకోలు

పాన్‌గల్: యాసంగిలో పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించి ఇబ్బందులను తొలగించాలని మండల రైతులు కోరుతున్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వరి పంటల కోతలు కోసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి రోజులు గడుస్తున్నా.. నేటికీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ఒక పక్క అకాల వర్షాలు కురుస్తుండడంతో కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యానికి ఎక్కడ నష్టం జరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించి ఇబ్బందులు తొలగించాలని రైతులు కోరుతున్నారు.



పాన్‌గల్ కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం

ఆరో రోజుకు చేరిన వీఓఏల సమ్మె



చిన్నంబావిలో మాట్లాడుతున్న రంగినేని అభిలాష్‌రావు



ఆత్మకూర్‌లో ఒంటికాలిపై నిలబడి నిరసన దీక్ష చేస్తున్న సిబ్బంది

పాన్‌గల్: ఐకేపీలో పనిచేస్తున్న గ్రామ సహాయకులు (వీఓఏ) తమ డిమాండ్ల సాధన కోసం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి ఆరో రోజుకు చేరింది. టీడీపీ కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా.పగిడాల శ్రీనివాసులు, గోపాలకృష్ణనాయుడు సమ్మెకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఐకేపీలో పనిచేస్తున్న గ్రామ సహాయకులు కనీస వేతనాలు అందక, ఉద్యోగ భద్రత లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అయా డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజయ్యగౌడ్, శ్రీనివాసులు, భాగ్యమ్మ, స్వరూపరాణి, బాలరాజు, శేషయ్య, ధర్మయ్య, పద్మ, కృష్ణయ్య పాల్గొన్నారు.

చిన్నంబావి: మండల కేంద్రంలో ఐకేపీ వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మెకు టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20ఏళ్లుగా వీఓఏ వ్యవస్థ గానీ బుక్ కీపర్లను సంఘటిత శక్తిగా మార్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని తెలిపారు. ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పరమేష్, వనపర్తి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీలత, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మద్దిలేటి, వీపనగండ్ల మండల అధ్యక్షుడు బీరయ్య యాదవ్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గంగయ్య యాదవ్, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ రాజేష్‌యాదవ్, నరసింహ, కోశాధికారి సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఒంటికాలిపై నిరసన

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ, వీఏఓల సమస్యలను పరిష్కరించడంలో ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తుందని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు ఉద్యమం ఆగదని మండల అధ్యక్షురాలు ఇంద్రావతి అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం వద్ద శనివారం ఐకేపీ వీఓఏల నిరవధిక సమ్మెలో ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అమరచింత మండల కేంద్రంలో వీఏఓల సమ్మెకు సీఐటీయూ నాయకులు మద్దతు పలికారు. కార్యక్రమంలో కురుమూర్తి, బాలస్వామి, రవి, పావని, రంగన్న , పావని, రంగన్న, రాధ పాల్గొన్నారు.

వంటావార్పు..

గోపాల్‌పేట: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మెను విరమించే ప్రసక్తే లేదని వీఓఏల మండల అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి రాందాస్‌నాయక్ అన్నారు. నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని వెలుగు ఆఫీస్ ఎదుట వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు.




పాన్‌గల్‌లో..



గోపాల్‌పేటలో వంటావార్పు..

అకాల వర్షంతో రైతన్న ఆగం



దొంతికుంటతండా తెలంగాణ మోడల్ పాఠశాల వద్ద రోడ్డుపై వర్షానికి కొట్టుకుపోయిన వడ్లు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంతో పాటుగా మండలంలోని మామిడిమాడ, సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లి, మల్కిమియాన్‌పల్లి, దొంతికుంటతండా తదితర గ్రామాల్లో శనివారం మధ్యరాత్రి సమయంలో అకాల వర్షం కురవడంతో వరి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. శుక్రవారం సాయంత్రం వరకు వాతావరణంలో పెద్దగా మార్పులు లేకపోవడంతో వరి కోతలు పూర్తి చేసుకున్న రైతులు వడ్లను కల్లాలు, రోడ్ల వెంట ఆరబెట్టారు. శనివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో కల్లాల్లోని వడ్లు రోడ్ల వెంట, పొలాల వెంట వర్షం నీటిలో కొట్టుకుపోయాయి. ఇక కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు ఈదురు గాలులకు నేలమట్టం కావడంతో పాటు గింజలు రాలిపోయాయి. ఆరుగాలం కష్టపడి పండించుకున్న పంట చేతికి వచ్చే సమయంలో ఇలా వరుణుడి ఆగ్రహానికి గురికావడంతో రైతులు అల్లాడిపోతున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు నష్టపరిహారం అందజేయాలని వేడుకుంటున్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో శనివారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షంతో చేతికొచ్చిన వరి పంట నేలమట్టమైంది. కోసి రాశులుగా పోసిన ధాన్యం వర్షం నీటిలో కొట్టుకుపోవడంతో అన్నదాతలు కన్నీటిపర్యంతమయ్యారు.

నేడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు ఖిల్లాఘనపురంలో, 8:30కు పర్వతాపురం, 9 గంటలకు మామిడిమాడ, 9:30కు అప్పారెడ్డిపల్లి, 10 గంటలకు మల్కిమియాన్‌పల్లి, 10:30కు అల్లమాయపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమానికి ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్‌తో పాటుగా మండలంలోని ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, రైతు సమన్వయ సమితి చైర్మన్లు హాజరవుతారని తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ



పెబ్బేరు: సీవీ రామన్ టాలెంట్ సెర్చ్ పరీక్షలకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో లిటిల్ స్కాలర్స్ ఒలంపియాడ్ విద్యార్థులు ప్రతిభ కనబర్చడంతో శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రమణ, హీరో ఆదిశేషులు అవార్డులు ప్రదానం చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి విద్యార్థులకు జీనియస్ అవార్డులు రావడంతో పాఠశాల యజామాన్యం వెంకటయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.